"బలహీన వర్గాలంటే ఎవరోయ్?" వేళాకోళంగా అడిగాడు వేణు-భార్య రాసిన పోటీ కథ చదువుతూ.

కొరకొరా చూసింది రాధ.

తను రాసిన ప్రతి కథనూ ఆమె భర్తకు చూపడం; అతగాడేమో వేళాకోళం పట్టించడం, అతడు ఘాటుగా విమర్శించిన కొన్ని కథలు ప్రచురింపబడి, పాఠకుల పొగడ్తలు పొందడం....ఆ పొగడ్తలను చదివి భర్తకు వినిపించి-యిప్పుడేమంటారు? అన్నట్లు ఆమె వెక్కిరించడం-ఆ స్వీట్ హోమ్‌లో మామూలే!

ఆమె కథల్లో ప్రధానంగా ధనవంతుల దోపిడికి గురిఅయే బలహీన వర్గాలనే చిత్రిస్తుంది. కాని పెట్టుబడిదారుల ఏజెంట్‌లా వేణు వాటిని విమర్శిస్తూ వుంటాడు. అలాని ఆమె భర్తకు తన కథలు చూపకుండా ఉండ లేదు. అయితే ఆమె అతని విమర్శను ఎదుర్కోడానికి ఒక కొత్త పద్ధతి కనిపెట్టింది.

కథ చదవడం పూర్తిచేసి వేణు విమర్శించడానికి నోరు తెరిచేలోగా చటుక్కున అతని పెదవులను తన పెదవులతో నొక్కేసింది. అంతే. విమర్శ బయటపడనే లేదు!

ఆ తర్వాత భార్య యిచ్చిన సూట్‌కేసు అందుకుని బస్‌స్టాండ్‌కు బయలుదేరాడు వేణు స్వస్థలం గుంటూరు వెళ్ళడానికి.

భర్త కనుమరుగు అయే వరకు గుమ్మంలోనే వుండి తర్వాత లోని కెళ్ళింది రాధ. కథ మళ్ళీ ఒకసారి చదువుకొని సంతృప్తిగా కవరులో పెట్టి — హేండ్‌బేగ్‌లో పడేసుకుంది- తర్వాత పోస్టు చేయడానికి.

* * *

"భారత దేశము నీతికి నిలయము. ఆధ్యాత్మిక చింతనకు ఆలవాలము. ప్రపంచములోని యితర దేశములకు మన దేశమే జ్ఞాన భిక్ష పెట్టినది...." బాబు చకచక చదువుతోంది. నోరు తెరుచుకొని ఆశ్చర్యంగా వింటున్నాడు నారాయడు.

'ఇంత బుల్లి నోట్లోంచి అంత పెద్ద మాటలు ఎలా వచ్చేస్తున్నాయో! వచ్చినా, తన నోట్లోంచి అలాంటి మాటలూడిపడతాయా? 'అది ఆతుమక..ఆద్మాతమక..దీంత స్పాదీయా ..నోరు తిరిగి సావడంలేదు... దానర్థం ఏటో?'

నారాయడి గుండె గర్వంతో నిండిపోయింది. తృప్తిగా దమ్ములాగి "ఈడు కలకేటరు అవుతాడు"అనుకుంటూ పాక బైటకు వచ్చాడు.

హడావుడిగా పరిగెత్తుకొస్తున్న వీరిగాడు-నారాయడ్ని లాక్కుపోయాడు. ఊరు చివర దిబ్బకాడ బస్సు బోల్తా కొట్టిందట-చూడ్డానికి.

ఊరు చివర రోడ్డు బాగా ఎత్తుగా వుండి హఠాత్తుగా కుడివైపు మలుపు తిరుగుతుంది. ఎడమ వైపు లోతుగా, లోయలా వుంటుంది- గోతులూ, చెట్లూ, పుట్టలతో. డ్రైవర్ కబుర్లు చెబుతూ తిన్నగా పోబోయి హఠాత్తుగా మలుపు గమనించి ప్రక్కకు త్రిప్పబోగా బస్సు అదుపు తప్పి దొర్లుకుంటూ ప్రక్కకు పడిపోయింది లోయలో; తలుపు తెరవడానికి వీల్లేని విధంగా.

ఎమర్జెన్సీ గేటుతెరిచి కొందరు ఎలాగో బస్సులోంచి బయటపడ్డారు. బంధు మిత్రులను బయటకు లాక్కువచ్చారు. బస్సు టాపు మీదనుంచి చెల్లా చెదురుగా పడిపోయిన సామానుల్ని ఒకచోట చేర్చారు.

కాళ్ళు విరిగిన వాళ్ళు.... చేతులు విరిగినవాళ్ళు.... మృతులూ.... ఏడుపులూ, పెడబొబ్బలూ. బాధ....

అంతటా రక్తం.... భయంకరంగా.... జుగుప్సగా....

ఘోరప్రమాదం చూడ్డం యిదే ప్రథమం ఏమో; నారాయడు బిగుసుకుపోయాడు. అతని కళ్ళు తిరుగుతున్నాయి. వీరిగాడు మాత్రం విభ్రాంతంగా చూస్తున్నాడు.

ఊళ్ళో ఎక్కడా టెలిఫోన్ లేదు. పోలీసు స్టేషన్ లేదు. ఆసుపత్రి లేదు. వెంటనే వైద్య సహాయం అందకపోతే దెబ్బలు తగిలిన కొందరు చనిపోవచ్చు. ఏం చేయడానికీ ఎవరికీ తోచడంలేదు. కొంతమంది కష్టపడి లోయలోంచి రోడ్డు మీదకు వచ్చారు. టౌన్ వెళ్తున్న లారీ ఎక్కి వెళ్ళారు- సహాయం కోసం.


అప్పటికి నారాయడి మైకం వదిలింది. వాతావరణంలో విషాదం తగ్గింది. శోకదేవత చెక్కిన విగ్రహాల్లా మౌనంగా కూర్చున్నారు కొందరు. ఓపిక వున్నవాళ్ళు యింకా వెక్కివెక్కి ఏడుస్తున్నా తీవ్రత తగ్గింది. క్షతగాత్రులు మాత్రం వుండుండి భయంకరంగా, బాధగా మూల్గుతున్నారు. అప్పటికి సగం గ్రామం తరలివచ్చింది. ఎవరికి తోచిన సాయం వారు చేస్తున్నారు. కాలం గడుస్తున్నకొద్దీ పరిస్థితి మెరుగుపడుతోంది. ఇప్పుడు రోదన లేదు. విషాదం లేదు. అంతటా గాంభీర్యతే.... నెమ్మదిగా మాటాడుకుంటున్నారు కొందరు. కర్తవ్యం ఆలోచిస్తున్నారు కొందరు.

గ్రామస్తుల సహాయ కార్యక్రమం మందగించింది.

"పాపా! మంచినీళ్ళు తెచ్చిపెట్టవూ!"

"ఇప్పటికి పదిసార్లు తెచ్చాను. మళ్లీ ఎళ్లలేను బాబూ!మా యిల్లు చాలా దూరం."

"పావలా యిస్తాను."






ఆ పిల్ల పరిగెత్తుకు వెళ్ళి ప్లాస్టిక్ చెంబుతో నీళ్ళు తెచ్చింది అంతే. ఆ క్షణం నుండి చెంబు నీళ్ళ ఖరీదు పావలా! ఎవరు అడిగినా, ఎవరు తెచ్చినా.

ఇప్పుడు ఖరీదుకి సేవ లభిస్తోంది! ఉచితంగా కాదు.

ఏదో మంత్రశక్తికి లోబడి- క్షతగాత్రులకు సేవచేసి,దుఃఖిస్తున్న వాళ్ళను ఓదార్చి దిక్కులేని వారి పట్ల కరుణించిన దేవతల్లా మూర్తీభవించిన మానవత్వంలా ప్రవర్తించిన గ్రామస్తులు - ఆ మంత్రశక్తి తొలగిపోగా క్రమక్రమంగా వెనుకటి గుణాలను తెచ్చుకున్న మనుష్యుల్లా ప్రవర్తించడం మొదలుపెట్టారు.

డబ్బా హోటల్ సుబ్బయ్య తలలో మెరుపు మెరిసింది. ఒక బకెట్‌లో నీళ్ళూ, గ్లాసులూ, మరో తపేళాలో నీళ్ళలాంటి టీ పట్టుకుని అక్కడకు వచ్చాడు. ఊళ్ళో పావలా ఖరీదు చేయని టీ యిప్పుడు అర్థరూపాయి! ఆవురావురని దాన్నె తాగారు అందరూ. ఆ తర్వాత వారం రోజులక్రితం తయారైన జంతికలు, చేకోడీలు వచ్చాయి. అరటి పళ్ళూ, జాంపళ్ళూ వచ్చాయి. వాటి ధరలూ చెట్టెక్కి కూచున్నాయి.

అందరూ ఈ హడావుడిలో వుండగా వీరిగాడు చుట్టూ చూస్తున్నాడు. అతని దృష్టి అటు తిరిగి యిటు తిరిగి ఒకేచోట లగ్నం అవుతోంది. అనుమానంగా అటు వేపు చూశాడు నారాయుడు. ఒక పొద ప్రక్కనే సూటుకేసు పడివుంది— పరీక్షగా చూస్తేగాని కనపడని విధంగా.

హఠాత్తుగా ఏదో నిర్ణయానికి వచ్చిన వాడిలా తడబడుతూ పొదవైపు వెళ్ళి మూత్ర విసర్జన చేస్తున్నట్లు కూర్చుని సూటుకేసుని పొదలోనికి తోసేశాడు ఎవరికీ కనిపించకుండా


నారాయుడు చూడనే చూశాడు. అతనిలో అసహ్యం పెల్లుబికింది. అరుద్దామనుకున్నాడు. తిడదామనుకున్నాడు ఈ చెంపా ఆ చెంపా వాయించేద్దామనుకున్నాడు.కాని..

దొంగలా నక్కుతూ, దూరంగా పడివున్న బస్సు వెనక్కి వెళుతున్న జోగన్న మీద పడింది నారాయడి దృష్టి. సవ్వడి చేయకుండా అనుసరించాడు....

బస్సు కింద చిక్కుకున్న దేనినో బయటకు లాగడానిక్కి ప్రయత్నిస్తున్నాడు దానయ్య. జోగన్నని చూసి ఉలిక్కిపడ్డాడు.... కాసేపు గుసగుసలు.... తోడు దొంగల్లా యిద్దరూ బలం అంతా ఉపయోగించి బస్సుని కొద్దిగా పెళ్ళగించి కింద మున్న దాన్ని చటుక్కున లాగేశారు.

ముందుకు వంగి చూశాడు నారాయుడు. అది కండక్టర్ కాష్ బ్యాగ్!

నారాయడిని చూసి వాళ్ళు ఉలిక్కిపడ్డారు. తర్వాత ఏదో రహస్యం చెబుతున్నట్లు కళ్ళతోనే నవ్వారు. నారాయడి వదనం వికసించింది.




ప్రస్తుతం నలుమూలలా వ్యాపింపచేయవలసినది క్రైస్తవ మతాన్ని కాదు. క్రీస్తు జీవితాన్నే వ్యాపింపచేయాలి.

—వివేకానందుడు

భగవంతుని కుమారులు అంటూ వున్న పక్షంలో మనం కూడా ఆ దేవుని సంతానం క్రిందే లెక్క. ఒక వేళ ఏసు క్రీస్తు దేవుడో, లేక దేవునిలాంటివాడో అయితే ప్రపంచంలోని మానవులంతా అంతేనని నా నమ్మకం. ఆధ్యాత్మిక ప్రపంచానికి మార్గదర్శి క్రీస్తును నేను గౌరవిస్తాను.

—గాంధీజీ

క్రీస్తు నోటివెంట వచ్చే బోధనలను చిన్నపిల్లవాడు సైతం అర్థం చేసుకోగలడు. కానీ ఆయనపై బలవంతంగా రుద్దబడిన ఆధ్యాత్మిక వాదాన్ని ఎవరూ అర్థం చేసుకోలేరు.

—థామస్ జఫర్సన్

ఒక వేళ క్రీస్తు తిరిగిరావడం అంటూ జరిగితే ఆయన్ని మరల శిలువ వేయకండి. ఆయనని భోజనానికి పిలిచి, ఆయన మాటల శ్రద్ధగా విని తీరికగా విమర్శించండి.

—థామస్ కార్లయిల్

ప్రపంచానికి ప్రేమతత్వ సందేశాన్ని అందించిన మహావ్యక్తి ఏసు క్రీస్తు. నిజానికి ఒంటరి జీవితం గడిపాడు.

—థామస్ ఉల్ఫ్

సేకరణ: జి. ఎస్. శర్మ

క్యాష్ బ్యాగ్‌లోంచి ముగ్గురూ మూడు వందలు తీసుకుని మిగిలిన డబ్బు దానిలోనే పెట్టేసి బస్సు కిందకు దాన్ని నెట్టేశారు.

ప్రమాదం జరిగిన తరువాత మూడు గంటలకు పోలీస్ వాన్, అంబులెన్సు వచ్చాయి. ఇంక్వయిరీ జరిపి రిపోర్టు రాసుకోడానికి గంట పట్టింది. గ్రామస్థుల సాయంతో క్షతగాత్రులను అంబులెన్సులోకి ఎక్కించారు. మిగిలినవాళ్ళు పోలీసు వాన్‌లో సర్దుకున్నారు.

మరో అరగంటకు ఆ ప్రదేశం నిర్జనం అయింది.

* * *

"....గ్రామం వద్ద గుంటూరు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ బస్సుకి ఘోర ప్రమాదం జరిగింది. డ్రైవర్, కండక్టర్లతో సహా దాదాపు పదిమంది చనిపోయారు. పదిహేను మందికి గాయాలు తగిలాయి. వారిని, మృతుల దేహాలను పట్నం ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు వెయ్యి రూపాయలు, గాయపడినవారికి ఐదు వందల చొప్పున సహాయం ప్రకటించింది....."

1-20కి ప్రాంతీయ వార్తలు వింటున్న రాధ ఉలిక్కిపడింది.

వేణు ఆ బస్సే ఎక్కి వుండాలి!

ఆమె గుండె గుబగుబలాడిపోయింది. ఒళ్ళు గజగజ వణికిపోయింది. తడబడుతూ పోస్టాఫీసుకి వెళ్ళి-వెంటనే రమ్మని తండ్రికీ మామగారికీ వైరు చేసి యింటికొచ్చింది. వాళ్ళు వచ్చే వరకైనా ఆగలేక-విషయం క్లుప్తంగా రాసి పక్కింటి వాళ్ళకిచ్చి, వాళ్ళ సానుభూతి వచనాలు వినిపించుకోకుండా పట్నం బయలుదేరింది.

ఆసుపత్రిలో వాతావరణం గంభీరంగా వుంది.

అంతవరకూ వచ్చాక ఆమె అడుగు ముందుకు పడలేదు. భూమికి కాళ్ళు అంటుకున్నదానిలా కాసేపు ఉండిపోయింది. హృదయం ఆవేశాన్ని అణచుకోలేక పోతోంది. భోరున ఏడుస్తూ కూలబడిపోయింది.

డాక్టరు వచ్చి ఉపశమనం కలుగజేశాడు. నర్సు ఆమెను వార్డులోకి తీసుకెళ్ళింది.

అదిరిపోతూ శవాలను చూసింది.

బెదిరిపోతూ క్షతగాత్రులను చూసింది.

వారిలో వేణు లేడు!

అరక్షణం ఆమె ముఖం వికసించింది. కాని మరుక్షణం అనుమానం కమ్మేసింది.

ప్రక్క గదిలో— ప్రయాణీకులు పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కి ప్రమాదం వివరాలు చెబుతున్నారు. కొంతమంది డబ్బు నగలు పోయాయి. మరికొందరి జాడతెలియడంలేదు అని.

"ఆ ప్రదేశం అంతా బాగా గాలించాం. చనిపోయిన వారుగాని, గాయపడినవారుగాని మరెవ్వరూ లేరు" అన్నాడు హెడ్ కానిస్టేబుల్.

"అయితే వాళ్ళు మరో బస్సులో వెళ్ళిపోయి వుండాలి."

రావలో ఆశ మిణుకు మిణుకు మంటోంది. వడివడిగా టాక్సీ స్టాండ్‌కు వెళ్ళింది— మరో గంట వరకూ పల్లెవైపు వెళ్ళే బస్సు లేదు. మరి!

బలహీనవర్గాల ప్రతినిధి అయిన టాక్సీ డ్రైవర్— యిరవై మైళ్ళ దూరానికి వంద రూపాయలిమ్మన్నాడు! నలభై లేక యాభయి రూపాయలయితే న్యాయం. కాని అతగాడు ఒక్క పైసా కూడా తగ్గనన్నాడు. పైగా టాక్సీలో శవం వేయవలసివస్తే మరో వంద యివ్వాల్సి వుంటుందన్నాడు.

పట్టపగలు నిలువుదోపిడిలా' అనిపించింది రాధకు. బేరాలాడుతూ కూచునే సమయం కాదు. హేండ్ బ్యాగ్‌లో చూసుకుంది. వెంటనే టాక్సీ ఎక్కేసింది.

పల్లె....

మాసిపోయిన బొమ్మరిల్లులా వుంది. అన్నీ పాకలే. ఊరినిండా రొచ్చుగుంటలు. దుర్గంధం.... ఈగలు డిస్కో-డాన్స్ చేస్తోంటె, దోమలు రాక్, పందులు స్వింగూ చేస్తున్నాయి! ఊరు, పట్నాల్లో కనిపించే మురికివాడలా వుంది. అంతా అలగా జనం. కాదు, కాదు... బలహీన వర్గాల వారు!

టాక్సీ దిగిన రాధకు ఎవరిని ఎలా అడగాలో అర్థంకాలేదు. దిక్కులు చూస్తూ రెండడుగులు ముందుకేసింది.

"భారత దేశము నీతికి నిలయము-ఆధ్యాత్మిక చింతనకు ఆలవాలము...." బాబు స్వరం చక్కగా వినిపించగా అటువైపు వెళ్ళింది.

కుక్కి మంచం మీద నడుము వాల్చి, చుట్ట కాల్చుకుంటున్నాడు. కాని ఈసారి బాబు తెలివి తేటల గురించి ఆలోచించడం లేదతడు. గంటక్రితం కల్లు పాకలో జరిగిన సంభాషణ గురించి ఆలోచిస్తున్నాడు.

తాగుతూ ఒక మూల కూర్చుని రహస్యంగా మాట్లాడుకోవడంలో వీరిగాడికి సూటుకేసులో నాలుగు వందలు దొరికినట్లు, జోగన్న, దానయ్యలు చెరొక ఉంగరం దక్కించుకున్నట్లు ఇతరులు ఎక్కువే సంపాదించుకున్నట్లు తెలిసినప్పటి నుంచి నారాయడిలో బాధ మొదలైంది.

'సీ! పెవాల్ని దోసుకోడం పరమ నిక్రుష్టం. ఆ పాపం నేను సేయలేను' అని సంతోషపడబోయాడు గాని గోరంత ఆ సంతోషం కొండంత బాధను కబళించలేక పోయింది.

తాగుడు పూర్తయాక— ఏమైనా దొరక్క పోతుందాని— మళ్ళి ప్రమాద స్థలానికి వెళ్ళాడు. ఆ ప్రదేశం నిర్జనంగా వుంది. రక్తపు మరకలతో భయంకరంగా వుంది. జంకుతూనే అంతటా వెదికాడు. ఉప యోగకరమైనదేదీ కనిపించలేదు. నిరాశగా మరికొంత దూరం నడిచాడు.

పరధ్యానంగా వున్నాడేమో. గోతి లోనికి జారి పడబోయి.... నిలదొక్కు కున్నాడు.

అప్పుడు.... అప్పుడు.... అతని కంట బడిందొక గుడ్డముక్క— గోతిలో-దట్టంగా అల్లుకున్న తీగల మధ్య. పరీక్షగా చూశాడు.... అది గుడ్డముక్క కాదు.... చొక్కా! కాదు కాదు.... చొక్కా ధరించిన.... ధరించిన....శవం!

గోతిలోకి దూకి శవం జేబులు వెదకా లన్న కోరిక కలిగింది నారాయడికి. కాని ధైర్యం చాలలేదు!'శవం అంటే.. దయ్యం! బాబోయ్!!' అనుకొని పరిగెత్తుతున్నట్లు యింటికి వచ్చిపడ్డాడు.

అదిగో.. అప్పటి నుంచి అతని మనసు. మనసులోలేదు.ఆ జేబుల్లో చాల డబ్బువుండ వచ్చున్న ఆశ ఒకవైపు. దయ్యం భయం మరోవైపు.

ఈ ఆలోచనలతో సతమతమౌతూ, యాధాలాపంగా బయటకు చూడగా.... లక్ష్మీదేవిలాంటి అమ్మాయి! అదృష్ట దేవత తలుపు తడుతున్నట్లు అనిపించింది నారా యడికి.... కుక్కిమంచంలోంచి లేచి బయ టకు వచ్చాడు. కంగారుగా.

ఆ కంగారులో— రాధ అడుగుతున్న దేమిటో— అతనికి మొదట అర్థం కాలేదు. అర్థం అయాక ఆలోచనలో పడ్డాడు.

"ఒక శవం కనబడింది కాని...." అంటూ తల గోక్కున్నాడు.

ఉలిక్కిపడింది రాధ.

"పెబుత్వం మీకెయ్యి రూపాయలిత్తాది కదా! నాకో వంద పడేయండి, సెవం సూపిత్తా. కట్టాల్లో వున్నా...."

ఇలాంటి మనుషులు కూడా వుంటారా. అని దిగ్భ్రాంతిగా చూసింది రాధ. బలహీన వర్గాల ప్రతినిధి ఇంత క్రూరంగా మాట్లాడ గలడనీ. నిస్సహాయులను ఇంత నిర్దయగా దోపిడీ చేయగలడని ఊహించి వుండలేదా రచయిత్రి.

"ఇవ్వడం యిష్టంలేకపోతే పోయి నీవే ఎతుక్కోవమ్మా!" విసుగుగా అనేసి లోనికి పోబోయాడు.

"అంత డబ్బులేదు.... తర్వాత ఎమ్. ఓ. చేస్తాను." అంది నీరసంగా.

"అయితే నీవేపోయి ఎతుక్కో"

వెంటనే పెళ్ళి ఉంగరం తీసి యిచ్చేసిం దామె. మారు మాటాడకుండా ముందడుగు వేశాడు నారాయడు. గుండెను ఒక చేత్తో అదుముకొని పసుగులాంటి నడకతో అనుస రించింది రాధ.

ప్రక్కనే మరొకరుండడంతో నారా యడికి ధైర్యం చిక్కింది. గోతిలోనికి దూకి శవాన్ని ఎలాగో బయటకు లాక్కు వచ్చాడు.

కన్నీటి తెరలోంచి స్పష్టంగా చూడలేక

మందారమకరందాలు

## ఉద్యాన లతల్ని మించే వనలత

రసాలు తొమ్మిదన్నా పన్నెండన్నా సామా న్యజనులు అయిదారే అనుకున్నా అన్ని టిలోనూ ఆనందమే పర్యవసానం. స్వీట్ తిన్నా సేవరీ తిన్నా కుంకుడుకాయిపులుసు తాగినా. ఎవరి ఆనందం వారు పొందుతారు. పుగాకు నమిలేవాళ్ళనీ నశ్యం పీల్చేవాళ్ళనీ కాదనడానికి వీల్లేదుగాని సృష్టిలోని ఒక వింతమాత్రం సనాతనమైన రుచి. నాటి నుంచీ నేటివరకూ కావ్యాల్లోనూ కథల్లోనూ ఫిల్ముల్లోనూ బ్లూఫిల్ముల్లోనూ అదే సనా తనమైన రసం.

అది రసరాట్టు - శృంగారం. జనాదరణ పొందిన సాహిత్యం కనకనే అలంకార గ్రంథాలనే బంగారపెట్టెల్లో కూడా దాచి లోకానికిచ్చారు. మనం కాదంటూనే స్వీక రిస్తాం. శుక. రంభల వాదం సాగుతూనే ఉంటుంది. కిందముడు సంసారం చెయ్యా లనుకుంటే లేడి రూపం ధరించాలా? అదొక ప్రిఫరెన్స్.

ఈవిడ ప్రాకృతంలో అంటోంది.మనకు అర్థం అయేందుకు సంస్కృతంలో చెప్పు కుంటున్నాం.


గ్రామరుహాస్మి. గ్రామేవసామి.
నగర స్థితిం నజానామి
నాగరి కాణాం పతీన్ హరామి.
యాభ వామి సాభవామి॥


ఒక విద్యావంతుడైన పెద్ద ఉద్యోగస్తుడి భార్య కాబోలు. వేనిటీబేగ్ ఊపుకుంటూ అప్పులనరసమ్మ ఇంటిని వెతుక్కుంటూ ఆ పల్లెటూరు వచ్చింది. ఆ రసమ్మను పలుగుర్లోనూ దులిపేసే ప్రయత్నం సాగించింది. రసమ్మ కొంతసేపు ఊరు కుని అందుకుంది. వీలాంటి వయ్యారిభామ లిదివరకు చాలామంది వచ్చి నా దగ్గిర మొత్తుకున్నారు.

"నేను పల్లెలో పుట్టాను. పల్లెలోనే వుంటున్నాను. రాజమండ్రీ పద్ధతులు నాకు తెలియవు. రాజమండ్రీ అమ్మాయిలవీ బొంబాయి బొమ్మలవీ కట్టుకున్నవాళ్ళం దర్నీ నా వశం చేసుకుంటూనేవున్నా. నే నెవతెనైతే దాన్నే అనుకో.

ఇంకెళ్ళొస్తావా బుల్లెమ్మా?" అంది. కిము న్నాస్తిగా (కిమపినాస్తి) అందరూ ఊరు కున్నారు గాని నోరు మెదపలేదు.

— సౌభరి






పోయింది రాధ. గజగజ వణికిపోయింది. నిలబడలేక పోయింది. వలవల ఏడ్చేసింది.

నారాయుడి హృదయం ద్రవించి పోయింది. మరుగున పడిన మానవత్వం మేల్కొంది. "ఊరుకో సెల్లెమ్మా!" అన్నాడు దగ్గరికి ఆర్తితో.

కాస్త స్థిమితపడి, కన్నీళ్ళు తుడుచుకొని భయం భయంగా శవం వైపు చూసింది.

ఉలిక్కిపడి అదాటుగా లేచి నిలుచుంది. తేరిపార చూసింది.

వేణు కాదు.... కాదు!.... కాదు!!

ఆమె ముఖం వెలిగిపోయింది.

"మీవారు కాదా సెల్లెమ్మా!!" అడిగాడు నారాయుడు. అతని స్వరంలోనూ ఆనందం. రిలీఫ్!

"కారు!.. కారు!! మావారు కారు!" అరిచింది రాధ. నారాయుడు ఉంగరం యిచ్చేశాడు.

"ఉంచుకో" అంది రాధ మనస్ఫూర్తిగా.

"ఒద్దమ్మా! ఆ ఎదవలు కక్కుర్తిపడితే, నేనూ పడ్డాను. నిక్రుట్టపు ఎదవని!"

* * *

వేణు ఛాతీ కన్నీటితోను, కాటుక మరకలతోనూ అసహ్యంగా తయారైంది.

ఆనాటి అనుభూతులు చెప్పి, చెప్పి; ఏడ్చి,ఏడ్చి అలసిపోయిన భార్య ముఖాన్ని తన ఛాతీకి అదుముకొని తల నిమురుతున్నాడు వేణు.

వేణు గుంటూరుకు బయలుదేరిన ఆ రోజున బస్టాండ్‌లో స్నేహితుడు కనిపిస్తే హోటల్‌కు వెళ్ళారు. ఈలోగా బస్ వెళ్ళిపోయింది. తన మోటార్ సైకిల్ మీద వేణుని గుంటూరు చేర్చాడు స్నేహితుడు. అందుకే అతడు బ్రతికిపోయాడు.

'అంతా దైవఘటన' అనుకొంది రాధ.

"ఇంకా ఆలస్యం దేనికి? ఈ సంఘటన ఆధారంగా ఓ కథ రాసెయ్" అన్నాడు వేణు వేళాకోళంగా.

హఠాత్తుగా రాధకు యింకా పోస్టుచేయని పోటీకథ జ్ఞాపకం వచ్చింది. గబగబ వెళ్ళి దాన్ని తగలబెట్టి వచ్చింది.

అర్థవంతంగా నవ్వాడు వేణు.

"నిరంతరంగా దోపిడికి గురిఅవుతున్నారని నీవు భావించిన బలహీన వర్గాలవారే— పరిస్థితిని బట్టి నిన్ను దోచుకోడానికి ప్రయత్నించారు. శవాన్ని దోచుకున్నది కొందరైతే— మంచినీళ్ళు కూడా అమ్ముకున్నది కొందరు. రేట్లు పెంచి, ప్రజల అసహాయస్థితి మీద వ్యాపారం చేసింది కొందరు. ధనవంతులే కాదు. అవకాశం కలిసి రావాలి గాని, బలహీనవర్గాలూ దోపిడికి సిద్ధమే. అయితే నీవూ నీలాంటి రచయితలూ— సుగుణాలన్నీ బలహీన వర్గాల్లోనే పోగుపడివున్నట్లు, దుర్గుణాలన్నీ ధనవంతుల్లోనే వున్నట్లు కథలు రాస్తారు. అదొక ఫ్యాషన్ అయిపోయింది. కానీ కనిపించే నిజం ఏమంటే - దోపిడి మానవ నైజం. దిక్కూ మొక్కూ లేనివాడు కనిపిస్తే చాలు ధనవంతులేకాదు, బలహీన వర్గాలవారూ దోపిడికి ప్రయత్నిస్తారు. అయితే ఆ దోపిడి పరిమాణం, తీవ్రత- పరిస్థితుల మీద, వ్యక్తిగత సంస్కారం మీద ఆధారపడివుంటాయి. నారాయుడు కాస్త సంస్కారం చూపాడు. మిగిలినవాళ్ళకది లేదు...అంతే."

మొదటిసారిగా భర్త విమర్శ పట్ల గౌరవం కలిగింది రాధకు!

## తెలుగు సాహితీ క్విజ్

1. ప్రముఖ రచయిత "హితశ్రీ" వ్రాసిన ఒక ప్రఖ్యాత స్టేజీ నాటిక?
2. ఆధునిక తెలుగు నవలల్లో ఈ రచయిత్రి నవలల్లో వైవిధ్యం ఎక్కువంటారు — ఎవరా రచయిత్రి?
3. ముళ్ళపూడి వారి సాహిత్యాన్ని సమగ్రంగా పరిశీలించిన మరో ప్రముఖ సాహితీకారుడు
4. శ్రీశ్రీ "మహాప్రస్థానం" ఎవరికి అంకితం ఇచ్చారు?
5. శ్రీనాథుడు నూనూగు మీసాల నూతన యవ్వనంలో వ్రాసింది—
6. తెలుగులో "సెక్స్" విషయ రచనకు ప్రఖ్యాతి వహించినవారు—
7. "నీలి" అనే అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన కథను వ్రాసింది—
8. "జనతా ఎక్స్‌ప్రెస్" — అనే కథ వ్రాసింది—
9. ఈ మధ్య "పేరడీల" రచనతో ప్రఖ్యాతి గాంచిన రచయిత—
10. "గులక రాళ్ళు — గులాబి ముళ్ళు" నాటిక వ్రాసిన ప్రముఖ నవలా రచయిత—

నిర్వహణ :

—ఎం. డి. సౌజన్య

సమాధానాలు :

1) విముక్తుడు
2) మాదిరెడ్డి సులోచన
3) ఎం. వి. ఎల్.
4) కొంపెల్ల జనార్దనరావు
5) శాలివాహన సప్తశతి
6) రాంషా
7) పురాణం సుబ్రహ్మణ్యశర్మ
8) ముళ్ళపూడి వెంకటరమణ
9) శ్రీరమణ
10) యండమూరి వీరేంద్రనాథ్